## పోలీస్ జెండా దినోత్సవానికి ఏర్పాట్లు

- రామగుం డం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**శెనార్తి మీడియా, మంచిర్యాల / గోదావరిఖని:**

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నుండి 31 వరకు పోలీస్ జెండా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన వివరించారు. ప్రజల్లో పోలీస్ విధులపై అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీస్ సేవలు, సాంకేతిక వినియోగం, పోలీస్ త్యాగాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. పోలీస్ సిబ్బందికి వ్యాస రచన పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. కానిస్టేబుల్ నుండి ఎఎస్ఐ స్థాయి అధికారులకు "పని ప్రదేశంలో లింగ వివక్ష", ఎస్ఐ స్థాయి మరియు పైస్థాయి అధికారులకు "గ్రామస్థాయి పోలీసింగ్ బలోపేతం" అంశాలపై తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో 500 పదాల లోపు వ్యాసాలు రాయవచ్చని వివరించారు. ప్రతిభ కనబరిచిన ముగ్గురికి బహుమతులు అందజేసి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అర్హత కల్పిస్తామని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు నిర్వహించి పోలీస్ అమరవీరుల కుటుంబాలను సందర్శించి నివాళులు అర్పిస్తారని చెప్పారు. పోలీస్ సేవలు, త్యాగాలను ప్రతిబింబించే చిన్న చలనచిత్రాలు, ఫోటోగ్రఫీ పోటీలు కూడా నిర్వహిస్తారని తెలిపారు. మూడు నిమిషాల లోపు చిన్న చలనచిత్రాలు, 10x8 పరిమాణంలోని ఫోటోలు అక్టోబర్ 23లోపు ప్రత్యేక శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన ఫోటోలు, చలనచిత్రాలు రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని వివరించారు. అమరవీరుల స్మృతిలో కళాబృందం పాటల కార్యక్రమాలు, ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపట్టతారని చెప్పారు. అక్టోబర్ 21న పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్మృతి పరేడ్‌తో జెండా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

## చెట్లు నరికిన కేసులో ఇద్దరి అరెస్ట్

- ఎఫ్ఆర్ఓ మమత

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

అటవీ సంపద రక్షణ అందరి బాధ్యత. వన సంపదను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఇంచార్జ్ ఎఫ్ఆర్ఓ మమత తెలిపారు. గొండుగూడ బీట్‌లో చెట్లు అక్రమంగా నరికిన జాధవ్ సుధామ్, జాధవ్ దేవిదాస్‌ను అధికారులు అరెస్ట్ చేసి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ లాల్‌బాయి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు భరోసా కల్పించాలి





- సీపీ అంబర్ కిషోర్ ఝా
- హాజీపూర్ పోలీస్‌స్టేషన్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి బాధితులకు భరోసా కల్పించాలన్నారు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా. ప్రజలు చేసే ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవడం ద్వారా పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెంపొందించాలన్నారు. గురువారం హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్ ఉద్యోగి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. విసిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ బలోపేతం చేయాలని, గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమై నమ్మకం పెంపొందించాలన్నారు. ప్రజల సమస్యలకు మర్యాదపూర్వకంగా స్పందించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా సీపీ స్టేషన్‌లోని రిసెప్షన్, సీసీ టీఎన్ఎస్, కంట్రోల్ రూమ్ వ్యవస్థలను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, దర్యాప్తు వివరాలను సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. తనిఖీ అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. కార్యక్రమంలో డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ప్రకాష్, రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ స్వరూప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు

- మంచిర్యాల సర్కిల్‌లో సర్వీసుల మంజూరు వేగవంతం :
- ఎస్ఈ ఉత్తమ్ జాడే

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

తెలంగాణలో రైతులకు నాణ్యమైన, వేగవంతమైన వ్యవసాయ విద్యుత్ సేవలు అందిస్తున్నట్లు మంచిర్యాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. సర్కిల్ పరిధిలో 2023లో 1426, 2024లో 1780 వ్యవసాయ సర్వీసులు మంజూరు అయినట్లుగా, 2025 అక్టోబర్ 16 వరకు 983 సర్వీసులు మంజూరైనట్లు, 2024తో పోలిస్తే 11.4 శాతం పెరుగుదల నమోదయిందని ఆయన పేర్కొన్నారు. రాబోయే మూడు నెలల్లో మరింత మంది రైతులకు సర్వీసులు మంజూ రు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు, పాత తాళాలు, విద్యుత్ లైన్లు లేని ప్రాంతాల్లో కూడా ఒకే నెలలో సర్వీసులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఓఆర్సీ (ఓపరేషన్ రీసీజ్ చార్జ్) చెల్లించాల్సిన సర్వీసులు రెండు నెలల్లోనే మంజూరైనట్లు వివరించారు. ప్రతి వారం, నెలల వారీగా వ్యవసాయ సర్వీసుల మంజూ రుపై ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు, అవసరమైన మెటీరియల్ స్టోర్‌లను ముందే అందుబాటులో ఉంచే విధంగా చర్య లు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులు ఏదైనా మెటీరియల్ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని, సమస్యలు ఎదురైనప్పుడు 1912 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం నమోదు నుంచి సర్వీస్ విడుదల వరకు ప్రతి దశలోనే రైతుల మొబైల్ నంబర్‌కు అప్డేట్ సందేశాలు పంపుతున్నట్లు, లింక్ ద్వా రా కనెక్షన్ స్థితి, మంజూరైన మెటీరియల్స్, ఓఆర్సీ చెల్లింపు వివరాలు పొందుపరిచినట్లు తెలిపారు. మెటీరియల్ తక్షణమే అందించే విధంగా ఈ-స్టోర్ విధానం రూపొందించబడింది. దీని ద్వారా రైతులు ఆన్‌లైన్ ద్వారా మెటీరియల్ రిజర్వ్ చేసుకుని పనులను వేగంగా ప్రారంభించగలుగుతున్నారు. ట్రా న్స్ఫార్మర్ల తరలింపు, మరమ్మత్తులు, కొత్త ట్రా న్స్ఫార్మర్ల ఏర్పాటు కోసం అవసరమైన వాహనాలను ఏర్పాటు చేసి, ఎటువంటి ఇబ్బందులు రాకుండా నిబద్ధతతో పని చేస్తున్నట్లు పేర్కొ న్నారు. 2024లో 353 ట్రాన్స్ఫార్మర్లు, 2025 లో ఇప్పటివరకు 198 ట్రాన్స్ఫార్మర్లు సర్కిల్‌లో ఏర్పాటు అయినట్లు చెప్పారు. రైతుల పట్ల ప్రత్యక్ష దృష్టితో "పొలం బాట" కార్యక్రమం ద్వారా విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు, వంగిన తాళాలు, లూజ్ లైన్లు, మధ్య స్తంభా లు, స్పేసర్లు వంటివి సకాలంలో ఏర్పాటు చేస్తు న్నట్లు వివరించారు. సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే, విద్యుత్ సేవల మం జూరుకు అన్ని తక్షణ చర్యలు తీసుకొని, రైతుల కు నిబద్ధతతో సేవలు అందిస్తున్నట్లు, వ్యవసా య ఖాతాదారుల శ్రేయస్సు కోసం పెద్ద ప్రాధాన్యతతో ప్రయత్నిస్తున్నట్లు స్పష్టం చేశారు.

## ఉత్సాహంగా అనస్థీషియా డే

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల టచ్ ఆసుపత్రిలో అనస్థీషియా డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. వైద్యులు వీటిలో సజీవంగా పాల్గొని వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టచ్ ఆసుపత్రి వైద్య బృందం వైద్య సేవల ప్రాముఖ్యతను, ముఖ్యంగా అనస్థీషియా వైద్యుల కీలక పాత్రను గుర్తు చేసింది. డా. శైలేష్ మాట్లాడుతూ, అనస్థీషియా ఆధునిక వైద్యశాస్త్రానికి వెన్నెముకలా ఉంటుందని, శస్త్రచికిత్సల్లో రోగికి నొప్పి లేకుండా చికిత్స అందించడంలో ఇది కీలకమని తెలిపారు. డా. సాయి పల్లవి అనస్థీషియా వైద్యులను కనిపించని వీరులుగా పేర్కొన్నారు. ప్రతి శస్త్రచికిత్స విజయవంతం కావడంలో వారి పాత్ర ముఖ్యమని, రోగి భద్రత కోసం నిశ్శబ్దంగా పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డా. గ్రీష్మ, డా. మదన్, డా. చిరంజీవి, డా. సిద్దార్థ్, డా. సత్య, డా. తిరుమల్ రావు, డా. రాజేష్, డా. వికాస్, డా. నవీన్, డా. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో వైద్య బృందం "రోగి భద్రత – మా బాధ్యత" అనే నినాదంతో అనస్థీషియా డేను స్ఫూర్తిదాయకంగా జరుపుకుంది.

## బీసీ బంద్‌కు సీపీఐ మద్దతు



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ఈ నెల 18న బీసీ సంఘాలు నిర్వహించనున్న తెలంగాణ బంద్‌కు సీపీఐ మద్దతు ప్రకటించింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడపు రాజమౌళి తెలిపారు. బెల్లంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బీసీల రిజర్వేషన్లకు అడ్డంకిగా ఉన్న పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, కోర్టు స్టేను రద్దు చేసి 42 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అగ్రవర్ణాలకు ప్రాధాన్యం ఇస్తూ బీసీలను విస్మరిస్తోందని విమర్శించారు. పార్లమెంటులో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా చట్టం చేయాలని, బంద్ విజయవంతం చేయడానికి అన్ని వర్గాలు సహకరించాలని కోరారు.

## ఎకో బజార్‌కు ఆదరణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం "ఎకో బజార్" కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కోర్, పర్యావరణ, అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆర్డీవో గూడూరు శ్రీనివాస్, భారత రాష్ట్రపతి పురస్కార గ్రహీత గుండేటి యోగేశ్వర్, జిల్లా విజ్ఞాన అధికారి రాజలింగం హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా అధ్యక్షత వహించారు. గూడూరు శ్రీనివాస్ పర్యావరణ పరిరక్షణను సమాజ సేవగా భావించాలని, విద్యార్థులు పచ్చదనాన్ని ప్రోత్సహించాలన్నారు. గుండేటి యోగేశ్వర్ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ సమతుల్యత కాపాడవచ్చని వివరించారు. రాజలింగం విజ్ఞానం, పర్యావరణం కలసి సాగితేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓజా మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన 25 స్టాళ్లలో 75 మంది పాల్గొని పునర్వినియోగ పదార్థాలతో తయారైన వస్తువులు, మట్టి దీపాలు, జ్యూట్ సంచులు, పచ్చదనానికి తోడ్పడే ఉత్పత్తులను ప్రదర్శించారు. సందర్శకులు ఈ ప్రదర్శనలను ఆకట్టుకున్నారు. ఎన్‌జీసీ ఇన్‌చార్జ్ జాడి మహేష్ కుమార్ సమన్వయంతో, అధ్యాపక బృందం సహకారంతో కార్యక్రమం విజయవంతం జరిగింది. విద్యార్థులు, అధ్యాపకులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం నేషనల్ గ్రీన్ కోర్ పర్యవేక్షణలో, భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ మద్దతుతో నిర్వహించారు.

## ఒంటరితనం భరించలేక యువకుడి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, గోదావరిఖని :**

ఒంటరితనం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. రామగుండం కార్పొరేషన్ ఇందిరమ్మకాలనీలో నివాసముంటున్న కాసుల రాకేశ్(34) తల్లి కర్మ ఈనెల 12న జరిగింది. అంతకముందే తండ్రి చనిపోయాడు. ఇద్దరూ మృతి చెందడంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడురోజుల క్రితం చనిపోగా ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి బావ కొమురోజు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్టీపీసీ పోలీసులు తెలిపారు.

# లాటరీ ద్వారా గురుకుల సీట్ల భర్తీ : జిల్లా కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లా పరిధిలోని అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లు భర్తీకి అభ్యర్థుల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు, గతంలో ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు, దరఖాస్తు చేసుకున్న వారు, అలాగే కొత్త అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా లక్షెట్టిపేట బాలికల గురుకులంలో అందజేయాలని సూచించారు. దరఖాస్తులతో కుల ధృవీకరణ పత్రం, ప్రవేశ పరీక్ష హాల్ టికెట్, ర్యాంక్ ధృవీకరణ పత్రాల జిరాక్సులు జత చేయాలని వివరించారు. లక్షెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లి బాలికల గురుకులలో, బెల్లంపల్లి, కాసిపేట, కోటపల్లి, మంచిర్యాల, జైపూర్ బాలురు గురుకులలో ఖాళీ సీట్లను ఈ నెల 18న లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. బాలికల గురుకులాల్లో 6వ తరగతిలో ఎస్సి 6, ఎస్టీ 2, బీసీ 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 7వ తరగతిలో బీసీ 5 సీట్లు, 8వ తరగతిలో ఎస్సి 4, ఎస్టీ 1, బీసీ 11, జనరల్ 6, మైనారిటీ 5 సీట్లు, 9వ తరగతిలో ఎస్సి 3, ఎస్టీ 4, బీసీ 4, జనరల్ 5, మైనారిటీ 3 సీట్లు ఖాళీగా ఉన్నాయి. బాలురు గురుకులాల్లో 5వ తరగతిలో ఎస్టీ 3, జనరల్ 3, మైనారిటీ 2 సీట్లు, 6వ తరగతిలో ఎస్సి 9, ఎస్టీ 5, జనరల్ 1, మైనారిటీ 6 సీట్లు, 7వ తరగతిలో ఎస్సి 5 సీట్లు, 8వ తరగతిలో ఎస్సి 8, బీసీ 8, జనరల్ 6, మైనారిటీ 8 సీట్లు, 9వ తరగతిలో ఎస్సి 12, బీసీ 4, ఓసి 7, మైనారిటీ 5 సీట్లు ఖాళీగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. లాటరీ పద్ధతిలో మాత్రమే విద్యార్థులు ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు.



# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం ఆయన చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్‌తో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యమైన సిమెంట్, ఇసుకను ఉపయోగించాలి, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి అని తెలిపారు. అదేవిధంగా, తెలంగాణ సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల, సంక్షేమ వసతి గృహాల అభివృద్ధి పనుల పురోగతిని చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మోహన్‌తో పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సదుపాయాలు కలిగిన నాణ్యమైన విద్య అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్, మూత్రశాలలు, భోజనశాలల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అమృత్ 2.0 పథకం కింద నీటి ట్యాంకులను నిర్మించి, ప్రజలకు తాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని, భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయించి స్థానికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సూచన కూడా కలెక్టర్ ఇచ్చారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





## బీసీ బంద్‌కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

బీసీల హక్కుల సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యం అన్నారు. ఈ నెల 18న బీసీ సంఘాలు నిర్వహిస్తున్న రాష్ట్ర బంద్‌కు నియోజకవర్గ బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు ఆదేశానుసారం పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. బీసీలను ఇక వెనుకబాటుకు గురిచేయకుండా, వారిని రాజకీయంగా ఎదిగే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో వ్యక్తిపై దాడి

**శెనార్తి మీడియా, కరీంనగర్ :** కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేసిన వ్యక్తిపై బుధవారం రాత్రి దాడి జరిగింది. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరీంనగర్‌కు చెందిన పరశురాం (58) కూలీ పని చేసుకుంటూ రోడ్లపైన జీవనం సాగిస్తున్నాడు. మద్యం మత్తులో బస్టాండ్ ఆవరణలో మూత్ర విసర్జన చేశాడు. అక్కడే ఉన్న కొందరు అతనిపై దాడి చేయడంతో చేయి విరిగింది. బాధితుడు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు రావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చెయ్యి విరిగిందని, సర్జరీ అవసరమని డాక్టర్లు తెలిపారు. అయితే పోలీసులే తనపై దాడి చేశారని, బాధితుడు తెలపడంతో వన్‌టౌన్ పోలీసులు బస్టాండ్ ఆవరణలోని సీసీ కెమెరాలను పరిశీలించారు.

### పెండింగ్ ఓటరు దరఖాస్తులకు

## సత్వర పరిష్కారం

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీ సుదర్శన్ రెడ్డి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ప్రజా మద్దతుతో కూడిన ఓటర్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలన్నారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటరు జాబితా సంబంధించి పలు అంశాలను సమీక్షించారు.కరీంనగర్ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.సీ.సుదర్శన్ రెడ్డి సూచనల ప్రకారం, పెండింగ్ దరఖాస్తులు ఎక్కడైనా ఉంటే ప్రత్యేక శ్రద్ధ పెట్టి వెంటనే పరిష్కరించాలి. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఫారమ్ 6, 7, 8 కు సంబంధించిన నోటీస్ 7 రోజుల లోపల ముగించాలి. ప్రతి పోలింగ్ బూత్ కు బూత్ స్థాయి అధికారులు (బి.ఎల్.ఓ.) నియామకం పూర్తి చేయాలి, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలి. నూతన ఓటర్లకు ఓటర్ ఐడి కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.సమావేశంలో డీఆర్ఓ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.